క్లుప్తంగా

సూర్యకాంతం శత జయంతి సభలో కృష్ణకు సత్కారం



కృష్ణను సత్కరిస్తున్న అతిథులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన యువ వ్యాసకర్త తంజంగారి కృష్ణకు చెన్నైలో జరిగిన తెలుగువారి గయ్యాళి అత్త సూర్యకాంతం శత జయంతి వేడుకలో అరుదైన గౌరవం లభించింది. చెన్నైలోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ సెంటర్‌లో ఇటీవల సినీ నటి, గయ్యాళి పాత్రలకు పెట్టింది పేరైన సూర్యకాంతం శత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగింటి అత్తగారు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో నగరానికి చెందిన యువ వ్యాసకర్త తంజంగారి కృష్ణ రచించిన తెలుగువారి సొత్తు గయ్యాళి సూర్యకాంతం అత్తమ్మ అనే వ్యాసం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కృష్ణను మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, అలనాటి మేటి నటీమణులు రాజశ్రీ, జయచిత్ర, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మాల తదితరులు సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు కళాకారులు, రచయితలు కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

గణపవరం: మండలంలోని మల్లపరాజుపేట గ్రామం కేశవరం బ్రిడ్జి సెంటర్‌లో అనుమతి లేకుండా మద్యం సీసాలు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి, 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపారు. కేశవరం బ్రిడ్జి వద్ద అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం పోలీసులు ఆకస్మిక దాడి చేయగా, పంపన వీర వెంకట శివన్నారాయణ అనే వ్యక్తి ఒక సంచిలో మద్యం బాటిళ్లు పెట్టుకుని అమ్ముతుండగా అతనిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంప్రోక్షణకు సిద్ధమైన శివాలయం

భీమడోలు: స్థానిక అతిపురాతన పార్వతీ సమేత భీమేశ్వర స్వామివారి ఆలయాన్ని దాతలు, భక్తుల విరాళాలతో అభివృద్ధి చేశారు. ఆలయంలో అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక భావన గోచరించేలా ఆలయ అభివృద్ధి కమిటీ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేసింది. ఈనెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేసేందుకు అభివృద్ధి కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఏపీకి జగనే మళ్లీ సీఎం కావాలి

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెదబాబు

ఏలూరు టౌన్: ఏపీలోని పేదల అభ్యున్నతి, సంక్షేమం, ఉపాధి, ఉద్యోగకల్పన కావాలంటే రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు మోతేవారితోట, వెంకటాపురం సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం చేపట్టారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. డివిజన్‌లో ఏఏ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో వివరించారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరించారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న వివిధ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో అందించిన సంక్షేమం ప్రజలందరికీ తెలుసని, ప్రతి కుటుంబానికీ నేరుగా సంక్షేమ పథకాలు అందించారని వివరించారు. టీడీపీ హయాంలో రూ.2.67 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు తాను అమలు చేసిన ఒక్క పథకాన్నైనా చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో పథకాలేవీ నేరుగా ప్రజలకు చేరిన పరిస్థితి లేదని, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల సిఫార్సులు లేకుంటే రూపాయి కూడా ఇచ్చిన దాఖలు లేవన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ములు చేరుతున్నాయని తెలిపారు. అవినీతికి తావులేకుండా ప్రతి కుటుంబానికీ ఏం సంక్షేమం అందించామో ఇంటింటికీ వెళ్లి చెప్పుకునే దమ్ము వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే ఉందని అన్నారు.



ఏలూరు టౌన్ : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంఆర్ పెదబాబు

ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఏలూరు నియోజకవర్గంలో రూ.700 కోట్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని ఆయన వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు తుమరాడ స్రవంతి, పప్పు ఉమామహేశ్వరరావు, పిల్లంగోళ్ల శ్రీదేవి, తంగెళ్ల రాము, క్లస్టర్–1 ఇన్‌చార్జి మొటమర్రి సదానందం, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వైఎస్‌వీ శివరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, దారపు తేజ, మహిళా సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలు అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ప్రజల హర్షం

ఏలూరు రూరల్ : నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామంలోని 115 మంది పేదలకు రూ.6 లక్షల విలువ చేసే ఇంటి స్థలం అందుకున్నారని చెప్పారు. 388 మందికి నెలనెలా పింఛన్ ద్వారా రూ.3.81 కోట్లు, వైఎస్సార్ సున్నావడ్డీ ద్వారా 536 మంది మహిళలు రూ 22.53 లక్షలు, జగనన్న విద్యా కానుక ద్వారా 203 మంది రూ.14.41 లక్షలు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. పథకాల ద్వారా సీఎం జగన్ పేదలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా కోరుకుంటున్నారని చెప్పారు. అనంతరం అధికారులు సంక్షేమ పథకాల వివరాలను ప్రదర్శించారు. పార్టీ స్తూపాన్ని ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. తొలుత ఎమ్మెల్యే మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ముంగర తిమోతీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేలంగి యోహాను, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, గంటా ప్రసాద్, తేరా ఆనంద్, మోరు సుబ్బారావుతో పాటు పలువురు సర్పంచ్‌లు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఏలూరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఏలూరు రూరల్ : పైడిచింతపాడు సభకు హాజరైన ప్రజలు

తూర్పువీధి పాఠశాలకు వితరణ



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కాశీపట్నపు ఫౌండేషన్ సంస్థ స్థానిక తూర్పువీధి నగరపాలక ఉన్నత పాఠశాలకు క్రీడా దుస్తులు, భోజనం ప్లేట్లు, యోగా మ్యాట్లు, అధునాతన సౌండ్ సిస్టమ్, ఎస్‌ఎంఎంఎస్‌కు స్టడీ మెటీరియల్, ఓఎంఆర్ స్కానర్‌లను గురువారం అందజేశారు. తమ పాఠశాలకు ఆయా పరికరాలు అందించిన కాశీపట్నపు ఫౌండేషన్ ప్రతినిధులు కాశీపట్నపు ఇందుకేశ్వరరావు, చైతన్య, శంకర వెంకట సుబ్బారావులకు ప్రధానోపాధ్యాయులు సీ హెచ్ హరిబాబు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు అనగాని శ్రీరామచంద్రమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

బకాయిల చెల్లింపు హర్షణీయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఇవ్వాల్సిన వేతనాల ఆరియర్స్ బకాయిలు పూర్తిగా చెల్లించినందుకు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు ఏఐటీయూసీ అనుబంధ ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం అభినందనలు తెలిపింది. ఎస్ఎంఆర్‌లకు బకాయి పడిన రెండు నెలల వేతనాలు కూడా చెల్లించడం పట్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏలూరు నగర పాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన 2022, జూన్ మాసం వేతనం కూడా చెల్లించాలని కమిషనర్‌ను కోరారు.

పోరాటాల ఫలితమే మహిళా హక్కులు

ఏలూరు (టూటౌన్): భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌డబ్ల్యూ) పోరాటాల ఫలితంగానే మహిళా హక్కులు, చట్టాలు సాధించుకొన్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర 15వ మహాసభ స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో గురువారం నిర్వహించారు. మహాసభకు కొల్లూరు సుధారాణి, గొర్లి స్వాతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహిళా సమాఖ్య పతాకాన్ని సీనియర్ సభ్యురాలు మన్నవ లక్ష్మీ సౌభాగ్యం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్లే మహిళా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మహిళా సమాఖ్య దేశ వ్యాప్తంగా పోరాటాలు సాగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు 2029 తర్వాత అమల్లోకి వస్తాయనడం మహిళలను వంచించడమే అన్నారు. డీలిమిటేషన్, జనాభా లెక్కలు, నియోజకవర్గం పునర్విభజన సాకుగా చూపి మహిళా రిజర్వేషన్లు వాయిదా వేయడం మహిళల పట్ల కేంద్రానికి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 100 రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తాం, ఏడాదికి రెండుకోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసగించిందన్నారు. మహిళలపై దాడులు జరుగుతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. మహాసభలో 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య ఏలూరు నగర అధ్యక్షురాలుగా కొండేటి బేబి, ఉపాధ్యక్షురాలుగా గొర్లి స్వాతి, కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సహాయ కార్యదర్శిగా కొల్లూరు సుధారాణి తో పాటు ఏడుగురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. మహాసభలో సీపీఐ నాయకులు కురెళ్ల వరప్రసాద్, ఉప్పులూరి హేమ శంకర్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మన్నవ యామిని, ఉప్పులూరి లక్ష్మి, అయిత భక్తుల దుర్గాభవాని, జోష్ మేరీ, తోట భవాని, కె.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న డేగా ప్రభాకర్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	27

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	7-10
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	40
కాకర కాయలు	20-24	కీరా దోస	42
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	74
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	16	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	45-55	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	18	పుదీనా	05
ఆనబకాయ (1)	15- 20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	15- 20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

వైఎస్సార్ సీపీ నుంచి చిలకా సతీష్ సస్పెన్షన్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చిలకా సతీష్‌ను వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఒక ప్రకటనలో తెలిపారు. చిలకా సతీష్ వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో అతని వైఖరిపై గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై క్షుణంగా పరిశీలించిన మీదట సతీష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్లు పి.మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్ర బోస్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే ఆళ్ల నాని తెలిపారు.

మహాసభను విజయవంతం చేయండి

దెందులూరు: ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను రాష్ట్రంలో మాదిగలంతా హాజరై విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, రాష్ట్ర నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్, కృష్ణా జిల్లా నాయకుడు యువరాజ్ పిలుపునిచ్చారు. గురువారం వారు కొత్తపల్లిలో మాట్లాడుతూ దశాబ్దాలుగా మాదిగలు, ఉపకులాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్న నేపథ్యంలో మాదిగలందరూ హాజరుకావాలని కోరారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'పై సమీక్ష

దెందులూరు: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం విజయవంతం కావాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం కొత్తగూడెంలో గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), నాయకులతో కార్యక్రమంపై చర్చించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనలను తెలియజేశారు. కొత్తగూడెంలో కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు.

రూ.1400 కోట్లతో గ్రామాలకు వాటర్ గ్రిడ్

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మించనున్నట్టు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చనుందన్నారు. గురువారం ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ బి.ప్రణవి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాలిపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొల్లిముంత రాము, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్ మాట్లాడుతూ ఏలూరు డ్రెయిన్ నీరు జాలిపూడి పంట కాలువల్లోకి పారడం వల్ల చెరువుల్లో తాగునీరు కలుషితమౌతోందన్నారు. ఈ సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరాజు సమస్యను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొద్దికాలం క్రితం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఆశ్రం వైద్య కళాశాల పరిసరాల్లో గోదావరి నీటితో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయనున్నారని వివరించారు. ఈ నీటిని శుద్ధిచేసి నేరుగా మాదేపల్లి, లింగారావుగూడెం, శ్రీపర్రు, మానూరు, మహేశ్వరపురం, కలకుర్రుతో పాటు చాటపర్రు, జాలిపూడి, బాబూఖాన్‌గూడెం, మెరకకాట్లంపూడి, పల్లపుకాట్లంపూడి గ్రామాలకు పంపింగ్ చేస్తారని చెప్పారు. దీంతో ప్రజలకు సురక్షిత తాగునీరు అందుతుందన్నారు. కలుషిత నీటి సమస్య శాస్వతంగా పరిష్కారమౌతుందన్నారు. దీనిపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచ్‌లు వర్రీ లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ కాకర్ల తంబి తదితరులు అడిగిన ప్రశ్నలకు అధికారులు ఈ క్రింది విధంగా సమాధానమిచ్చారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- గ్రామాల్లో ప్రభుత్వం కోట్ల రూపాయలతో చేపట్టిన 11 సచివాలయాలు, 8 హెల్త్ సెంటర్లు, 52 సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని పీఆర్ఏఈ కృష్ణమోహన్ చెప్పారు.
- ఖరీఫ్ సాగులో 10,156 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు. ఇందుకోసం 2.53 లక్షల గోనె సంచెలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రబీలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తామన్నారు.
- మొండికోడులో రూ.15 లక్షలతో తాగునీటి పైప్‌లైన్, కలకుర్రులో రూ.60 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, మైక్రోఫిల్టర్ వాటర్‌సిస్టమ్ పనులకు టెండర్లు పిలిచామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ చెప్పారు. గుడివాకలంక, శ్రీపర్రు, మాదేపల్లిలో నిర్మించిన ట్యాంకులు, పైప్‌లైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్నట్టు వివరించారు.
- శ్రీపర్రులో 57 మంది పేదలకు కొత్తగా ఇంటి స్థలాలు మంజూరయ్యాయని తహసీల్దార్ జి.శ్రీనివాసరావు చెప్పారు. అర్హులు దరకాస్తు చేసుకున్న 90 రోజుల్లో పట్టాలు అందిస్తామన్నారు.
- ఏలూరు పాండురంగా థియేటర్ నుంచి చాటపర్రు వంతెన వరకు సుమారు 1500 మీటర్ల దూరం సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసిందని హౌసింగ్ అధికారులు చెప్పారు.

ప్రపంచ శాంతి కోరుతూ నేడు, రేపు నిరసనలు



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): పాలస్తీనా, గాజాపై ఇజ్రాయేల్ దాడులు అరికట్టాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో నిరసలు చేపట్టాలని వామపక్షాలు పిలుపు నిచ్చాయి. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నగర అధ్యక్షుడు పి.కిషోర్ అధ్యక్షతన సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ(యు) పార్టీల సమావేశం గురువారం ఏర్పాటుచేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నెల రోజులకు పైగా ఇజ్రాయేల్ పాలస్తీనా, గాజాపై బాంబులు వర్షం కురిపిస్తోందన్నారు. ఆసుపత్రులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. అమెరికా వత్తాసుతో ఇజ్రాయేల్ పాలస్తీనాపై ఎగబడుతుందని తెలిపారు. భారత విదేశీ విధానంలో గత తన అలీన విధానాన్ని విడనాడి అమెరికా ఎటు చెబితే అటు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజా సామ్యవాదులు, పౌర సమాజం, పాలస్తీనాపై ఇజ్రాయేల్ దాడులను ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి యు.హేమశంకర్, న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, ఎంసీపీఐ జిల్లా నాయకులు ఎస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న తపన చౌదరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తపన ఫౌండేషన్ సహకారంతో ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంటును గురువారం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు. సెయింట్ థెరిస్సా యాజమాన్యం విజ్ఞప్తికి వెంటనే స్పందించి తపన ఫౌండేషన్ ద్వారా ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన తపన చౌదరిని స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ పి.సునీలా రాణి ఘనంగా సత్కరించారు.

ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఎన్నిక చెల్లదు



మాట్లాడుతున్న ఆర్యవైశ్య అర్బన్ జిల్లా అధ్యక్షుడు చెక్కా రాజా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు అర్బన్ ఆర్యవైశ్య మహాసభకు నూతనంగా కార్యవర్గం ఎన్నికైనట్టు కొందరు ప్రచారం చేసుకుంటున్నారని, అది చెల్లదని ఆ సంఘ అధ్యక్షుడు చెక్కా రాజా అన్నారు. గురువారం రాత్రి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ముక్కాల ద్వారకానాథ్ పని చేస్తున్నారని, ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగుతందని అన్నారు. కొందరు పదవీ కాంక్షతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గం మారినట్టు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. దీనిపై ద్వారకానాథ్ కోర్టుకెళ్లగా స్టే విధించిందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ద్వారకానాథ్ కొనసాగుతున్నారని, ఆయన ఆధ్వర్యంలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల, మండలాల ఆర్యవైశ్య సంఘాలు పని చేస్తున్నాయని చెప్పారు. ద్వారకానాథ్ ఆధ్వర్యంలో త్వరలో మండల, జిల్లా స్థాయి కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య అర్బన్ జిల్లా ప్రతినిధులు ఎంటీవీ సత్యకుమార్, వేమా కోటేశ్వరరావు, నంగులూరి సత్యనారాయణ, కూరాళ్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.